ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
మంగళవారం
8 జూలై
2025





# దేవుడితో పాటు ఆళ్వార్లు కొలువై ఉండడం యాదగిరిగుట్ట ఆలయ విశిష్టత

## త్రిదండి రామచంద్ర రామానుజ జీయర్ స్వామి

యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: హిందూ దేవాలయాల్లో ఎక్కడా లేనివిధంగా భగవంతునితో పాటు ఆళ్వార్లు కొలువై ఉండడం యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్ర విశిష్టత, ప్రత్యేకత అని త్రిదండి రామచంద్ర రామానుజ జీయర్ స్వామి ప్రవచించారు. యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామిని సోమవారం ఆయన తన పీఠం బృందంతో కలిసి దర్శించుకున్నారు. గర్భగుడిలో స్వయంభూ నారసింహుడిని దర్శించుకుని ముఖ మంటపంలో స్వామివారి ఉత్సవమూర్తులకు అష్టోత్తర పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. తూర్పు రాజగోపురం నుండి త్రితల గోపురం గుండా ఆలయంలోకి ప్రవేశించిన ఆయనకు ఆలయ ప్రధానార్చకులు నల్లంతిఘల్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వెంకటాచార్యుల అర్చకత్వంలో అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికి దర్శనం కల్పించారు. అనంతరం ప్రధానాలయ ముఖ మంటపంలో అర్చకులు, వేదపండితులు, ఆలయ సిబ్బందికి జీయర్ స్వామి పండిత గోష్టి నిర్వహించారు. అనంతరం జీయర్ స్వామికి ఆలయ ఏఈవో జూషెట్టి కృష్ణ లడ్డూప్రసాదం, స్వామివారి శేషవస్త్రాలు అందజేసి నారసింహుడి ఫొటోను బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన ప్రవచిస్తూ.. చాతుర్మాస్య దీక్ష ప్రారంభ మాసంలో లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని ధన్యులమైనట్లు పేర్కొన్నారు. ప్రతి క్షేత్రంలో భగవంతుడు మాత్రమే కొలువై ఉండగా.. యాదగిరిగుట్ట క్షేత్రంలో మాత్రం భగవంతునితో పాటు ఆళ్వార్లు కూడా కొలువై ఉండడం ఆలయ ప్రత్యేకత అని తెలిపారు. స్వామివారి ఆశీస్సులు సర్వజనులపై ఉండాలని మంగళాశాసనాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్లు రాజన్ బాబు, శంకర్ నాయక్, ఆలయ ఉప ప్రధానార్చకులు, అర్చకులు, వేదపండితులు తదితరులు ఉన్నారు.





# జర్నలిస్టులచే ఉచిత నోట్ బుక్స్ పంపిణీ


## భారత సేవా సంఘం సౌజన్యంతో

**జనగామ, జులై 7 (రోమింగ్ న్యూస్) :** జనగామ జిల్లా తరిగొప్పుల మండల కేంద్రంలో భారత సేవాశ్రమ సంఘం మరియు తెలంగాణ జర్నలిస్టు యూనియన్ సంయుక్త ఆధ్వర్యంలో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల సుమారు 1100 వందల మంది విద్యార్థులకు జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల (పి.ఎం శ్రీ )లో నోటు పుస్తకాల పంపిణీ చేశారు. సోమవారం ప్రారంభించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీడీవో దేవేందర్ రెడ్డి, డిప్యూటీ తహసిల్దార్ రామారావు, తెలంగాణ జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కప్పర ప్రసాద్ రావు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బింగి స్వామి పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత సేవాశ్రమ సంఘం తరపున మునీశ్వరానంద స్వామి ఇంతటి మహత్తర కార్యక్రమం చేయడం అభినందనీయం అన్నారు ఈ కార్యక్రమాన్ని తెలంగాణ జర్నలిస్టు యూనియన్ తరిగొప్పుల మండలం తీసుకురావడం వలన మండలంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఎంతో మేలు చేకూరుస్తుంది అన్నారు ప్రతి విద్యార్థి శ్రద్ధగా చదివి పై స్థాయిలకు ఎదిగి ఉన్నత లక్ష్యాలను సేదించాలని ఇప్పుడు ఉన్న ఐఏఎస్ ఐపీఎస్ అధికారులు ఎందరో ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులే అన్నారు కరెక్ట్ ఈ కార్యక్రమం నిర్వహించిన తెలంగాణ జర్నలిస్టు యూనియన్ కు అభినందనలు తెలిపారు. భారత సేవాశ్రమ సంఘం చైర్మన్ మునిశ్వరానంద స్వామీజీ మాట్లాడుతూ ఈ కార్యక్రమం తరిగొప్పుల మండలంలో చేయడం ఎంతో ఆనందంగా ఉందని ఈ పుస్తకాలు విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అనంతరం తెలంగాణ జర్నలిస్టు యూనియన్ జనగామ జిల్లా అధ్యక్షుడు భూస రమేష్ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి సహకరించిన అధికారులకు తోటి జర్నలిస్టులకు కృతజ్ఞతలు తెలిపారు సెల్ ఫోన్ కు దూరంగా ఉంటూ విద్యకు దగ్గరగా ఉండాలని విద్యార్థి దశ అనేది భవిష్యత్తుకు ఒక పునాది లాంటిది అని ఈ సమయంలో తీసుకునే నిర్ణయాలు మీ జీవితాలను ప్రభావితం చేస్తాయని ఈ విలువైన సమయాన్ని చదువు కొరకు ఇప్పుడు ఉపయోగిస్తే ముందు తరం ఎంతో మంచి స్థాయిలో ఉంటారని అన్నారు ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి జానకి పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీందర్ నాయక్ ఏ ఎస్ ఐ రాజయ్య అప్స స్వచ్ఛంద సంస్థ సీనియర్ కోఆర్డినేటర్ బొట్టు రమేష్ గ్రామ కార్యదర్శి భాగ్యలక్ష్మి టీజేయు ప్రధాన కార్యదర్శి రాజేష్ యాదాద్రి భువనగిరి అధ్యక్షుడు షానూర్ వర్కింగ్ ప్రెసిడెంట్ కుంభం రమేష్ యాదవ్ కార్యదర్శులు చిలువేరు మహేందర్ సొంటెక్క కుమార్ మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు తరిగొప్పుల జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




# పెద్దకందుకూరు 'ప్రీమియర్' లో ప్రమాదం

**పీఆర్డీసీ బిల్డింగ్ లో ప్రొడక్షన్ పనులు జరుగుతుండగా మంటలు**
**ఓ కార్మికుడి చేతులు, ముఖానికి గాయాలు, హాస్పిటల్‌కు తరలింపు**




యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట మండలం పెద్దకందుకూరు గ్రామశివారులో ఉన్న ప్రీమియర్ ఎక్స్ ప్లోజివ్స్ కంపెనీలో సోమవారం ప్రమాదం చోటు చేసుకుంది. కంపెనీలోని పీఆర్డీసీ సెక్షన్-2 బిల్డింగ్ లో ప్రొడక్షన్ మిస్సింగ్ పనులు జరుగుతుండగా.. ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. దీంతో అదే బిల్డింగ్ లో విధులు నిర్వర్తిస్తున్న తాళ్లగూడెం గ్రామానికి చెందిన కుచ్చుల బాలరాజుకు స్వల్ప గాయాలు అయినట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో కార్మికుడి చేతులు, ముఖానికి స్వల్పంగా కాలిన గాయాలు కావడంతో భువనగిరి ఏరియా హాస్పిటల్ లో ఫస్ట్ అయిడ్ చేసి మెరుగైన చికిత్స కోసం సికింద్రాబాద్ యశోద హాస్పిటల్ కు తరలించినట్లు కంపెనీ హెచ్ఆర్ డిప్యూటీ మేనేజర్ కరుణాకర్ రెడ్డి వెల్లడించారు. కార్మికుడు బాలరాజుకు ఆరోగ్యం నిలకడగా ఉందని, ఎలాంటి ప్రాణాపాయం లేదని యశోద డాక్టర్లు స్పష్టం చేశారని తెలిపారు. కాగా పీఆర్డీసీ బిల్డింగ్ లో మంటలు రేగిన సమయంలో.. ఆ బిల్డింగ్ లో మొత్తం ఎనిమిది మంది కార్మికులు డ్యూటీలో ఉన్నారని, బాలరాజు అనే కార్మికుడు మెటీరియల్ మిక్సింగ్ చేస్తుండగా మంటలు చెలరేగి చేతులు, ముఖానికి కాలిన గాయాలైనట్లు తెలిసింది. ఇదిలా ఉండగా ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న ఓ మహిళా కార్మికురాలు షాక్ గురై కళ్లు తిరిగి పడిపోయింది. కాసేపయ్యాక మహిళ తిరిగి తేరుకుని యధాతథంగా విధులు నిర్వర్తించారని తెలిసింది.

## 'ప్రీమియర్' కంపెనీలో తరచూ ప్రమాదాలు

ప్రీమియర్ ఎక్స్ ప్లోజివ్స్ కంపెనీలో తరచూ ప్రమాదాలు జరుగుతుండడంతో.. కంపెనీలో పనిచేస్తున్న కార్మికులు భయాందోళన చెందుతున్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా కంపెనీ యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని కార్మికులు ఆరోపిస్తున్నారు. ఈ ఏడాది జనవరి 4న పేలుడు సంభవించి ఓ కార్మికుడు చనిపోగా ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన మర్చిపోక ముందే ఏప్రిల్ 29న కాటేపల్లిలోని ప్రీమియర్ ఎక్స్ ప్లోజివ్స్ ప్లాంట్ లో సంభవించిన భారీ పేలుడు ధాటికి ముగ్గురు కార్మికులు స్పాట్ లోనే చనిపోగా.. మరో కార్మికుడు హాస్పిటల్ లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మరో నలుగురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన జరిగిన రెండు నెలల్లోపే పెద్దకందుకూరు ప్రీమియర్ ప్లాంట్ లో సోమవారం మళ్లీ ప్రమాదం చోటు చేసుకోవడం కార్మికుల పట్ల యాజమాన్యం రక్షణ, భద్రత వైఫల్యం బట్టబయలైంది. ఇకనైనా తమ రక్షణపై కట్టుదిట్టమైన చర్యలు చేపట్టి తమ ప్రాణాలు కాపాడాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

# మంత్రి పొంగులేటిని కలిసిన పూర్వ వీఆర్వోల సంఘం నాయకులు



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: గ్రామ పరిపాలన అధికారులుగా పూర్వ వీఆర్వోలు, వీఆర్ఏలకు మరో అవకాశం ఇవ్వాలని పూర్వ వీఆర్వోలు, వీఆర్ఏల సంక్షేమ సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు పూర్వ వీఆర్వోలు, వీఆర్ఏల సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రాల బాలకృష్ణ ఆధ్వర్యంలో పలువురు వీఆర్వోలు, వీఆర్ఏలు సోమవారం హైదరాబాద్ లోని మినిస్టర్ క్వార్టర్స్ లో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై మంత్రి పొంగులేటి సానుకూలంగా స్పందిస్తూ.. ఇప్పటికే క్వాలిఫై అయిన 3,500 మంది పూర్వ వీఆర్వోలు, వీఆర్ఏలకు గ్రామ పరిపాలన అధికారులు, సహాయ అధికారులుగా అవకాశం కల్పించామని, మరోసారి కూడా అవకాశం ఇస్తామని మంత్రి తెలిపారని జిల్లా ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ చెప్పారు. ఈ కార్యక్రమంలో పూర్వ వీఆర్వోల సంఘం నల్గొండ జిల్లా నాయకుడు ఎండీ నజీర్, రాష్ట్ర, జిల్లా నాయకులు ఉన్నారు.

# బీజేపీ నాయకులు అన్ని స్థానాల్లో పోటీకి సిద్ధంగా ఉండాలి

## బీజేపీ ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు అజ్మీరా కిషన్ నాయక్



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ చేయడానికి బీజేపీ నాయకులు సిద్ధంగా ఉండాలని బీజేపీ ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు అజ్మీరా కిషన్ నాయక్ సూచించారు. యాదగిరిగుట్టలోని బీజేపీ మండల కార్యాలయంలో సోమవారం జరిగిన బీజేపీ మండలస్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వార్డుల నుండి మొదలుకుని జెడ్పీటీసీ వరకు పోటీ చేయడానికి నాయకులు రెడీగా ఉండాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు అర్థమయ్యేలా వివరించి క్షేత్రస్థాయిలో పార్టీకి మద్దతు కూడగట్టాలన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న ప్రతి పథకంలో కేంద్రం వాటా ఉన్న విషయాన్ని దాచి పెడుతున్న రాష్ట్ర ప్రభుత్వ తీరును ఎక్కడికక్కడ ఎండగట్టాలన్నారు. కేంద్రం వాటాపై గడపగడపకు తిరిగి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. మండల, గ్రామస్థాయి క్యాడర్ ఒకరికొకరు కోఆర్డినేట్ చేసుకుంటూ పార్టీ బలపరిచే సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షురాలు గుంటుపల్లి మహేశ్వరి సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి కాదూరి అచ్చయ్య, స్టేట్ కౌన్సిల్ మెంబర్ రచ్చ శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి గోపగాని ప్రసాద్ గౌడ్ తదితరులు ఉన్నారు.

# నకిరేకల్ లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుని జన్మదిన వేడుకలు



**నకిరేకల్ :** నకిరేకల్ లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీ కందాల పాపిరెడ్డి గారి జన్మదిన వేడుకలు సోమవారం రాత్రి నకిరేకల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు అనంతరం హాజరైన గౌరవ సభ్యులు పాపి రెడ్డి గారిని ఘనంగా సన్మానించారు క్లబ్ అధ్యక్షుడు రే పాల సతీష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఫాస్ట్ డిస్టిక్ గవర్నర్ డాక్టర్ వై మోహన్ రెడ్డి ట్రస్ట్ చైర్మన్ రామ్మోహన్రావు క్లబ్ కార్యదర్శి సూర్యచంద్రరావు కోశాధికారి అండె వెంకటేశం సభ్యులు పాల్గొన్నారు

